● స్కూటర్‌పై 98వేల కిలోమీటర్ల సంకల్పయాత్ర

అమ్మ కోసం


శ్రీవారిని దర్శించుకున్న ఆనందంలో అమ్మా కొడుకులు

పాత బజాజ్ చేతక్ స్కూటర్ నడుపుతూ కొడుకు.. వెనుక సీటుపై అమ్మ.. ఒకటీ రెండూ కాదు, ఇలా 98వేల కిలోమీటర్లు తిరిగి తిరుమలకు వచ్చారు ఈ తల్లీకుమారులు. ఉల్లాసంగా ఉత్సాహంగా దూసుకుపోతున్న వీరిని పలకరించినపుడు ఆసక్తికరమైన అనేక సంగతులు పంచుకున్నారు. స్కూటర్ నడుపుతున్న దక్షిణామూర్తి కృష్ణకుమార్‌ది మైసూరు. బెంగళూరులోని ఒక కార్పొరేట్ సంస్థలో టీం లీడర్‌గా ఉద్యోగం. 2015లో తండ్రి చనిపోవడంతో అమ్మను బెంగళూరుకు తీసుకువచ్చాడు. జీవన సహచరుడ్ని కోల్పోయిన దుఃఖంలోంచి అమ్మను బయటకు తీసుకురావడానికి రోజూ ఆఫీసు నుంచి వచ్చాక ఆలయాల గురించి చెప్పేవాడు. ఆమె ఎంతో ఆసక్తిగా వినేది. ఒకరోజు ఎందుకో.. 'అమ్మా.. నువ్వు ఇప్పటిదాకా ఏయే ఆలయాలు సందర్శించావు?' అని అడిగాడు. నోటితో కాకుండా తొణికిసలాడే కన్నీటితో అమ్మ సమాధానం చెప్పింది. తన సమీపంలో ఉండే ఒక్క ఆలయానికి కూడా ఆమె ఇప్పటిదాకా వెళ్లనేలేదు అని తెలుసుకుని తల్లడిల్లిపోయాడు. 68 ఏళ్ల వయసు వచ్చినా ఇల్లు తప్ప ఆమెకు మరో ప్రపంచం తెలీదు. 'నీకు దేశంలో ఉన్న అన్ని ఆలయాలూ చూపిస్తానమ్మా!' అని కృష్ణకుమార్ తల్లికి మాటిచ్చాడు. ఉద్యోగం చేస్తూ అమ్మకి ఆలయాలన్నీ చూపించడం సాధ్యం కాదని అతనికి అర్థమైంది. 2018లోనే రూ.60 వేలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేశాడు. 2018 జనవరి 16న తన బజాజ్ స్కూటర్ మీదే 'మాతృ సేవా సంకల్ప యాత్ర' ప్రారంభించాడు. కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, పశ్చిమబెంగాల్, సిక్కిం, అస్సోం, మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్.. ఇలా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలన్నీ తల్లితో స్కూటర్‌పై తిరుగుతున్నాడు ఈ 45 ఏళ్ల కుమారుడు. నేపాల్, భూటాన్‌కూ తల్లితో స్కూటర్‌పైనే వెళ్లాడు. ఇప్పటికి 98,109 కిలోమీటర్లు ప్రయాణించాడు. గురువారం తిరుమలకు చేరుకుని తల్లి చూడరత్నమ్మతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నాడు. తన సంకల్పయాత్రకు అవరోధం కాకూడదని కృష్ణకుమార్ పెళ్లి కూడా చేసుకోలేదు. ఎందుకీ త్యాగం? అని అడిగితే, 'చనిపోయాక శ్రాద్ధకర్మలు ఘనంగా చేయడం కాదు.. బతికి ఉన్నపుడు సంతోషపెట్టడమే కొడుకుగా నా బాధ్యత' అని సమాధానం ఇచ్చాడు. ఈ సంకల్ప యాత్రలో ప్రయాణిస్తున్నది ఇద్దరు కాదు, ముగ్గురు. అంటూ తన స్కూటర్ వైపు మురిపెంగా చూశాడు. 'నాకు 21 ఏళ్ల వయసులో నాన్న ఇచ్చిన కానుక ఇది. దీని మీద తిరుగుతూ ఉంటే నాన్న కూడా మాతోపాటే యాత్రలు చేస్తున్నట్టుగా ఉంది. ఈ యాత్రకు ముగింపు లేదు. అమ్మా నేనూ ఓపిక ఉన్నంతదాకా ఇలా తిరుగుతూనే ఉంటాం. ఒక్కో గుడినీ సందర్శిస్తూ ఉంటే అమ్మ గొప్ప ఆనందం పొందుతోంది. నాకు జన్మనిచ్చిన తల్లికి ఇంతకన్నా ఏవిధంగా రుణం తీర్చుకోగలను?' అని అమ్మను అల్లుకుపోయి ఆనందంగా చెప్పాడు కృష్ణకుమార్.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


బైక్‌పై కుమారుడు కృష్ణకుమార్, తల్లి చూడరత్నమ్మ

ప్రధాని సభకు 70 బస్సులు


బస్‌లో బయలుదేరుతున్న ప్రజలు

తిరుపతి (కలెక్టరేట్), మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు భారీ ఎత్తున జనం తరలివెళ్లారు. కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో 70 బస్సుల్లో సుమారు 3వేల మంది గురువారం రాత్రి బయలుదేరారు. సభ ముగియగానే తిరిగి స్వగ్రామానికి చేరుకునే వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతులు కల్పిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. కాగా, తిరుపతితో పాటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచీ చాలావరకు బస్సులు అమరావతికి వెళ్లాయి. దీంతో తిరుపతి బస్టాండులో బస్సుల కొరతతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. శుక్రవారమూ ఇదే పరిస్థితి ఏర్పడనుంది.

మూడు టన్నుల రేషన్ బియ్యం సీజ్

తిరుపతి(నేరవిభాగం), మే 1(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి నెల్లూరుకు తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని తిరుపతి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పలమనేరు, బైరెడ్డిపల్లి, గంగవరం, చిత్తూరు, బంగారుపాళ్యం, తిరుపతి జిల్లా తిరుపతి, పాకాల, చంద్రగిరి నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని వ్యాను ద్వారా నెల్లూరుకు తరలిస్తున్నారు. తిరుపతి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ సురేంద్రకు అందిన సమాచారం మేరకు వెస్ట్ సీఐ మురళీమోహన్ నేతృత్వంలో పోలీసులు, సివిల్ సప్లయిస్ సిబ్బంది కృష్ణాపురం ఠానా వద్ద పట్టుకున్నారు. మూడు టన్నుల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. బైరెడ్డిపల్లి మండలం బెల్లంమడుగు గ్రామానికి చెందిన ఎం.కిషోర్ రెడ్డి హస్తమున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వెస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.

సింగిల్‌విండోల పీఐసీలకు గడువు పొడిగింపు

● చిన్నగొట్టిగల్లు విండో పీఐసీ మార్పు

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సత్యవేడు, సిద్ధవరం, చిట్టమూరు సింగిల్‌విండోలు, సూళ్ళూరుపేట ఫార్మర్స్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీల ప్రస్తుత పర్సన్ ఇంఛార్జి కమిటీల గడువు బుధవారంతో ముగిసింది.దీంతో ఈ నాలుగు సహకార సంఘాల పీఐసీల గడువును అక్టోబరు 30 వరకూ ప్రభుత్వం పొడిగించింది. చిన్నగొట్టిగల్లు సింగిల్‌విండోకు పీఐసీగా చంద్రగిరి సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.ఉమాపతి స్థానంలో చంద్రగిరి సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ టి.ప్రదీప్‌ను నియమించింది.

కాలుష్య కారక వాహనాలకు నో ఎంట్రీ

తిరుమల, మే1(ఆంధ్రజ్యోతి): కాలుష్యం పెరగడానికి కారణమవుతున్న 25 వాహనాలను తిరుమలకు రాకుండా నిషేధం విధించారు. ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు.. 25 వాహనాల నుంచి అధికంగా కాలుష్య పొగ విడుదలవుతున్నట్లు గుర్తించారు. వీటికి అనుమతి నిరాకరించారు. కండీషన్ సక్రమంగా ఉన్న తర్వాతే అనుమతిస్తామన్నారు. సరైన పత్రాలు, ట్రాక్స్, ఫిట్నెస్ లేని 19 వాహనాలకు సంబంధించి రూ.2.80 లక్షలు జరిమానా విధించారు. తనిఖీల్లో ఆర్టీవో కార్యాలయ ఎంవీఐలు శ్రీనివాసులు, రమణానాయక్, ఆంజనేయప్రసాద్, తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట నుంచి నాయుడు పేట వరకు.. 57 కిలోమీటర్లు, రూ.2510 కోట్లతో నిర్మించిన ఆరు వరుసల జాతీయ రహదారిని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ రహదారి జిల్లాను కోల్‌కతా-చెన్నై నేషనల్ హైవే-16తో అనుసంధానం చేసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


రేణిగుంట వద్ద ఆరు వరుసల రహదారి

57 కిలోమీటర్లు.. రూ.2510 కోట్లు

6 వరుసల రహదారి

● రేణిగుంట- నాయుడు పేట హైవేని నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

● ఊపందుకోనున్న పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలు

వాస్తవానికి రేణిగుంట నుంచి నాయుడుపేటకు డబుల్ రోడ్డు మాత్రమే ఉండేది. 1996-2004 నడుమ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు చొరవతో పూతలపట్టు- నాయుడుపేటకు ఫోర్ లేన్ రోడ్డు మంజూరైంది. భూసేకరణ సంబంధిత సమస్యలతో ప్రాజెక్టు సుదీర్ఘ కాలం పెండింగులో పడింది. 2014-19 నడుమ తిరిగి చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు బంగారుపాలెం మండలం మొగిలి నుంచీ పూతలపట్టు మండలం రంగంపేట, చంద్రగిరి, తిరుపతి మీదుగా నాయుడుపేటకు సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కేంద్రం వెంటనే ఆమోదించినా భూసేకరణ విషయంలో పలువురు రైతులు కోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో మొగిలి నుంచి చంద్రగిరి వరకూ పనులు పూర్తయ్యాయి. చంద్రగిరి నుంచి రేణిగుంట వరకూ చాలాచోట్ల పెండింగులో ఉన్నాయి. ఇక, రేణిగుంట- నాయుడుపేట నడుమ 2022 జనవరి 31న పనులు ప్రారంభమయ్యాయి. హైబ్రిడ్ ఆన్యుటీ మోడ్ పద్ధతిలో నిర్మాణం జరిగింది. సిక్స్ లేన్ రోడ్డుకు అనుబంధంగా అన్ని గ్రామాల వద్దా సర్వీసు రోడ్లు, 3 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 5 వెహిక్యులర్ అండర్ పాస్‌లు, 7 ఫ్లై ఓవర్లు, 15 బ్రిడ్జిలు, 56.827 కిలోమీటర్ల డ్రైన్లు కూడా నిర్మించారు.

జోరందుకోనున్న పారిశ్రామిక ప్రగతి

సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం.. ఈ ప్రాంత స్వరూప స్వభావాలను సమూలంగా మార్చివేయనుంది. అభివృద్ధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి. నాయుడుపేట నుంచీ దక్షిణంగా తడ పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. నాయుడుపేట కూడా పారిశ్రామిక కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే ఆ మండలంలో మేనకూరు సెజ్‌తో పాటు ఏపీఐఐసీకి చెందిన పారిశ్రామిక వాడలున్నాయి. నాయుడుపేట నుంచీ ఉత్తరంగా కోట, చిల్లకూరు, గూడూరు వైపు సాగరమాల, భారత్‌మాల రోడ్డు ప్రాజెక్టులు, క్రిస్ సిటీ వంటి అభివృద్ధి ప్రాజెక్టులు శరవేగంగా రూపు దిద్దుకుంటున్నాయి. ఈ రోడ్ కనెక్టివిటీ ఏర్పడడం వల్ల వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల్లోని శ్రీసిటీ, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులకు ప్రాధాన్యం పెరుగుతోంది. అంతిమంగా పారిశ్రామిక, ఆర్థిక కార్యలాపాలు జోరందుకోనున్నాయి. దీనివల్ల జిల్లాకు, రాష్ట్రానికి ఆర్థికాదాయంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఇంకో వైపు రియల్‌ఎస్టేట్ పరంగా భూముల విలువ గణనీయంగా పెరగనుంది. దాని వల్ల రైతులు, స్థలాల యజమానులు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయి.

సిక్స్ లేన్ రోడ్డుతో ప్రమాదాలకు చెక్

రేణిగుంట- నాయుడుపేట సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టినట్టయింది. ఇది వరకు డబుల్ రోడ్డు ఉండేటప్పుడు విపరీతమైన ట్రాఫిక్ వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగేవి. సగటున ఏడాదికి యాభై మందికిపైగా మృత్యువాత పడేవారు. క్షతగాత్రుల సంఖ్య మరీ ఎక్కువగా వుండేది. ఈ మార్గంలో ప్రయాణమంటేనే వాహనదారులు, ప్రయాణికులు భయపడే వారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారైతే.. రాత్రిళ్లు ఏ వాహనం ఢీకొట్టి వెళ్లిందో కూడా తెలిసే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు ఆరు వరుసల రోడ్డు కావడంతో వాహనాల ఓవర్ టేకింగ్ సమస్య కావడం లేదు. ఫలితంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గాయి.

తగ్గిన ప్రయాణ సమయం

ఇదివరకూ రేణిగుంట-నాయుడుపేట నడుమ 55 కిలోమీటర్లు బస్సులో వెళ్లాలంటే రెండు గంటలు.. కార్లు, జీపులైతే గంటన్నర సమయం పట్టేది. ఇపుడు సిక్స్ లేన్ రోడ్డు పూర్తి కావడంతో మరో రెండు కిలోమీటర్ల దూరం పెరిగినా.. బస్సులో గంట, కార్లు, జీపుల్లో అయితే 45 నిమిషాల్లో చేరుకోగలుగుతున్నారు.

మన్నసముద్రం వద్ద సిద్ధమైన టోల్‌ప్లాజా


సారా రహిత జిల్లాగా తిరుపతి

● కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటన

తిరుపతి(కలెక్టరేట్), మే 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిని సారారహిత జిల్లాగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఎస్పీ హర్షవర్ధనరాజు, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్‌తో కలిసి ఆయన నాటుసారాపై సమీక్షించారు. నవోదయం 2.0లో భాగంగా చంద్రగిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం మండలాల్లో నాటుసారా తయారీ గ్రామాలను గుర్తించి మూడు నెలలుగా అన్ని శాఖల సమన్వయంతో ప్రజల్లో అవగాహన తీసుకొచ్చామన్నారు. 153 మంది పాత నేరస్థులను బైండోవర్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో 18 గ్రామాలను.. ఏడు మండలాలను సారా రహిత మండలాలుగా తీర్మానించామన్నారు. వివిధ శాఖల అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఫలించిన నవోదయం-2

తిరుపతి(నేరవిభాగం), మే 1 (ఆంధ్రజ్యోతి): నవోదయం-2 ఫలించింది. తిరుపతి సారా రహిత జిల్లాగా మారింది. దశలవారీగా రాష్ట్రాన్ని సారా రహితంగా మార్చేందుకు ప్రభుత్వం నవోదయం-2 కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతిని సారా రహిత జిల్లాగా ప్రకటించాలనే ఉద్దేశ్యంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఇతర అధికారులు, సిబ్బంది పని చేశారు. ఏడు మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో సారా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. మూడు నెలలుగా రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్, అటవీశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. సారా తయారీ.. విక్రయ ప్రాంతాలను గుర్తించారు. వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేశారు. మరోవైపు ఎస్పీ హర్షవర్ధనరాజు డ్రోన్ల ద్వారా సారా తయారీ, నిల్వ కేంద్రాలను గుర్తించేలా చర్యలు చేపట్టారు. ఇక, సారా తయారీ గ్రామాల్లో తరచూ కార్డెన్ సెర్చ్ నిర్వహించి పాత నేరస్తులను బైండోవర్ చేయడం, తనిఖీలు చేపట్టడం, సారా వల్ల కలిగే అనర్థాలపై గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అవగాహన కల్పించడం.. ఇలా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కృషి ఫలించింది. దీంతో తిరుపతిని సారా రహిత జిల్లాగా కలెక్టర్ గురువారం ప్రకటించారు. ఇక్కడితో వదిలేయకుండా.. మళ్లీ కొద్ది రోజుల పాటు గ్రామాల్లో ముమ్మరంగా పర్యటించనున్నారు. ఎక్కడా సారా తయారీ, విక్రయాలు లేకుండా చూసి ప్రతి రోజూ కలెక్టర్‌కు అధికారులు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

తూకివాకం పంచాయతీలో పింఛన్లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్


తొలిరోజు 95.72శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్),మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో తొలిరోజైన గురువారం సాయంత్రం 7.30 గంటలకు 95.72 శాతం పంపిణీ చేశారు. ఉదయం 6.30గంటల నుంచే జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ మొదలు పెట్టారు. 2,61,230 మందికి గాను రాత్రి 7.30గంటలకు 2,50,049 మందికి(95.72శాతం) పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ రేణిగుంట మండలం తూకివాకంలో పంపిణీ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఈ నెలా కందిపప్పు లేదు

జిల్లాలోని 5.92 లక్షల రేషన్‌కార్డులకు దాదాపు ఐదు టన్నుల కందిపప్పు అవసరం. కానీ, 500 కిలోల బఫర్ స్టాక్ మాత్రమే పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు చెప్పారు. ఈ లెక్కన శుక్రవారం నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడం లేదు. బియ్యం, చక్కెర పంపిణీకే పరిమితం కానున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కార్డుదారులకు కందిపప్పు ఇవ్వలేదు. చాలావరకు బియ్యానికే పరిమితమైంది. కూటమి అధికారంలోకి వచ్చాక బియ్యం, చక్కెర, కందిపప్పుతో పాటు చిరుధాన్యాలనూ సరఫరా చేస్తామని చెప్పారు. రెండు నెలలు కందిపప్పుతో పాటు జొన్నలూ ఇచ్చారు. రెండు నెలలుగా కందిపప్పు అరకొరగా సరఫరా అవుతోంది. ఈ నెలలో 500 కిలోలకే పరిమితమైంది. రాష్ట్రస్థాయిలో కందిపప్పు సరఫరాకు టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఇదీ ఓ కారణమని తెలుస్తోంది. జూన్ నుంచి కందిపప్పు సరఫరా అవుతుందని తెలిసింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

మొదలైన 'వేసవి' క్రీడలు

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. శాప్ ఆధ్వర్యంలో తిరుపతి అర్బన్ పరిధిలో 25, రూరల్‌లో 25, డీఎస్ఏ కోచ్‌ల ఆధ్వర్యంలో 16, ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఆరు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చారు. వివిధ క్రీడాంశాల్లో పాల్గొనేందుకు బాలబాలికలు తరలివచ్చారు. ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున గడిపారు. పీడీలు, కోచ్‌లు మెరుగైన ఏర్పాట్లు చేయడంతో క్రీడాకారులు సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ముగిసే వరకు సదుపాయాలు కొనసాగిస్తామని డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తెలిపారు.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి


శ్రీనివాస క్రీడా సముదాయంలో...

చంద్రగిరి

ఘనంగా మే డే వేడుకలు



చిన్నగొట్టిగల్లులో వేడుకల్లో పాల్గొన్న ఏకేశ్వర రెడ్డి

పాకాల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. రైతు సంఘం, ఆటోస్టాండ్లు, భవన నిర్మాణ కార్మికులు, ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లు, పంచాయతీ కార్మికులు కార్మిక జెండాలను ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎం.ప్రకాష్, సీఐటీయూ నాయకుడు మధుసూదన్‌రావు, వివిధ సంఘాల నాయకులు భారతి, సుగుణ, రమేష్, ఆనంద్, వేణు, గణేష్, తంబి, వెంకటేష్, గుణశేఖర్, మురళి, డాక్టర్ సాంబశివ పాల్గొన్నారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏఐటీయూసీ జెండా ఎగురవేసి కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఏకేశ్వరరెడ్డి పాల్గొన్నారు. భాకరాపేట ఆటో స్టాండులో ఆటో కార్మికులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, వైద్యులు ముఖేష్, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి లోకయ్య నాయుడు, సిబ్బంది కమలమ్మ, దినేశ్ పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాల ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధారెడ్డి

పాకాల, మే 1 (ఆంధ్రజ్యోతి): పాకాల సచివాలయం, కెవడ్డేపల్లెలో ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాలను ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలందరికీ రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫికెట్లతో పాటు కుట్టుమిషన్ అందిస్తుందన్నారు. నియోజకవర్గంలో యూనియన్ బ్యాంక్ ఇండియా సహకారంతో చేపట్టిన ఉచిత టైలరింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, జడ్పీటీసీ పద్మజరెడ్డి, సర్పంచ్‌లు ఎస్.కస్తూరి, కె.వరలక్ష్మీ, ఎంపీడీవో అరుణ, ఈవోపీఆర్డీ శశిరేఖ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

భాకరాపేట, మే 1(ఆంధ్రజ్యోతి): తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ ఎడంవారిపల్లెలో మహాభారత ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పగలు తిరుపతికి చెందిన ఉష భాగవతారిణి హరికథ, రాత్రి వెంటేశ్వర నాట్య కళామండలి నాటకాలు నిర్వహిస్తున్నారు. నాటకాలు ఈనెల 7 నుంచి ప్రారంభమై 18న దుర్యోధన వధతో ముగుస్తాయి. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు అన్నదానం చేయనున్నారు.

చెట్టును ఢీకొన్న బస్ : 10మందికి గాయాలు



తిరుత్తణి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్ సహా 10 మందికి గాయాలయ్యాయి. తిరుపతి నుంచి రోజూ పళ్లిపట్టు మీదుగా వెంగలరాజుపురానికి ఏపీఎస్ఆర్టీసీ బస్సు నడుపుతున్నారు. గురువారం మధ్యాహ్నం పళ్లిపట్టు-షోలింగర్ జాతీయ రహదారిలో వస్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. గాయపడిన డ్రైవర్, తిరుపతికి చెందిన రామ్మూర్తి సహా పది మందిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర





పట్టువస్త్రాలు తీసుకొస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, పులివర్తి వినీల్- గంగమ్మను దర్శించుకున్న మంచు విష్ణు

చంద్రగిరి, మే 1(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలో గురువారం నడి వీధి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నడివీధి గంగమ్మ, దొడ్డి గంగమ్మల ప్రతిమలను విశేషంగా అలంకరించారు. ఎగువూరులో నడివీధి గంగమ్మ, దిగువూరులో దొడ్డిగంగమ్మలను కొలువుదీర్చారు. గురువారం తెల్లవారు జామున నుంచి గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సినీనటుడు మంచు విష్ణు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు వినీల్, డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ నాయకులతో కలిసి, అమ్మవారికి సారెను సమర్పించారు. రాత్రి 7 గంటల సమయంలో యువకులు కోలాహలంగా, బాణసంచా కాలుస్తూ, డప్పుల నడుమ నడివీధి గంగమ్మ, దొడ్డి గంగమ్మలను ఊరేగించారు. కల్యాణీ డ్యాంలో నిమజ్జనం చేశారు. టీడీపీ నాయకులు గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లకు స్పందన భేష్

తిరుపతి రూరల్, మే1(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండ్రోజులుగా జరుగుతున్న స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లకు స్పందన బాగుందని సబ్ రిజిస్ట్రార్ సి.విజయకుమార్ తెలిపారు. నిర్ణీత రోజుల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30గంటలలోపు పబ్లిక్ డేటా ఎంట్రీ(పీడీఈ) సిస్టమ్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. తొలిరోజు బుధవారం 40, గురువారం 11డాక్యుమెంట్లని చేసుకున్నారని వివరించారు.

పూల,పండ్లతోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

తిరుపతి రూరల్, మే1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రైతులు సాగుకు అనుబంధంగా పూల, పండ్లతోటల పెంపకం చేపట్టి ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని ఎంపీడీవో కె.రామచంద్ర సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఎన్ఆర్ఈజీఎస్, అగ్రి, హార్టికల్చర్ మండల విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఐదెకరాలలోపు పొలం ఉన్న రైతులకు ఉపాధి హామీ పథకంలో గుంతల దగ్గర నుంచి సాగు వరకూ మొత్తం ఖర్చు ప్రభుత్వం సమకూర్చుతుందన్నారు.మండల వ్యవసాయాధికారులు మమత, ప్రపూర్ణ, హార్టికల్చర్ అధికారి సునీల్, ఉపాధిహామీ ఏపీవో జ్యోతిశ్రీ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

హాస్టల్ మరమ్మతు పనులు నాణ్యంగా ఉండాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు నాణ్యంగా ఉండేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులను ప్రణాళికబద్ధంగా ఉపయోగించాలన్నారు. అదనంగా అవసరమైన నిధులను సీఎస్ఆర్, ఎంపీ లాడ్స్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ద్వారా సమీకరించాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమాధికారి, సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి రాజేంద్రరెడ్డి, ఈఈ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రాజా సోము, అధికారులు రేష్మ, గీత పాల్గొన్నారు.

20నుంచి ఎల్ఎల్ఎం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

● ఫీజు చెల్లింపునకు 9వ తేదీ చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని లా కాలేజీల్లో నిర్వహిస్తున్న ఎల్ఎల్ఎం కోర్సు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల విభాగం గురువారం విడుదల చేసింది. 20 నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 1 నుంచి 9వ తేదీ దాకా గడువు విధించారు. 14వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ నిర్వహిస్తారని ఎస్వీయూ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఎంపీ అప్పలనాయుడు

తిరుమల, మే1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ అప్పలనాయుడు, తెలంగాణ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉన్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఘాట్‌రోడ్డులో అదుపు తప్పిన కారు



తిరుమల, మే1(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో గురువారం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. వివరాలిలా..బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని తమ కారులో గురువారం సాయంత్రం తిరుగు ప్రయాణమైంది. మార్గంలోని 17వ మలుపు వద్ద కారు అదుపుతప్పి కుడివైపునున్న చిన్నపాటి గట్టును దాటి చెట్టును ఢీకొంది. అదృష్టవశాత్తూ కారులోని ఎయిర్ బాగులు తెరుచుకున్నాయి. దీంతో కారులోని నలుగురు భక్తులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. చోదకుడి నిద్ర మత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ వలకు చిక్కిన విద్యార్థి

● రూ.6.56 లక్షలు స్వాహా

తిరుపతి(నేరవిభాగం) మే 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్థుల వలలో ఓ విద్యార్థి చిక్కుకున్నాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం కొప్పరవాండ్ల పల్లికి చెందిన వంశీ డిప్లొమో చదివాడు. స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ గ్రూపుల ద్వారా ఉద్యోగావకాశం లభించింది. ఈక్రమంలో అతడిని నేహ అగర్వాల్ అనే మహిళ వాట్సాప్ ద్వారా సంప్రదించింది. స్టాక్ మార్కెట్‌లో లాభాలొస్తాయని నమ్మబలికింది. ఆమె, మరో వ్యక్తి కలసి వంశీని రెండు వాట్సాప్ గ్రూపుల్లో చేర్చారు. స్టాక్ మార్కెట్‌పై సూచనలు చేస్తూ అతనితో పాటు అతడి తల్లి ఖాతాల నుంచి రూ.6.56 లక్షలు రాబట్టారు. వాట్సాప్‌లో పంపిన లింక్‌ల మేరకు బిక్స్ ట్రేడ్ అనే ఫేక్‌యాప్ ద్వారా అతను ఇన్వెస్ట్ చేసిన డబ్బులు తిరిగి తీసుకోవాలంటే రూ.10 లక్షలు చెల్లించాలని సూచించారు. దీంతో తాను మోసపోయినట్లు వంశీ గ్రహించి గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



తిరుమల, మే1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు, శుక్ర, శని, ఆదివారాలు వరుస సెలవులు కావడంతో గురువారం మధ్యాహ్నం నుంచి భక్తుల సంఖ్య పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీడీసీ వరకు వ్యాపించింది. వీరికి 14 గంటల దర్శన సమయం పడుతోంది. స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు ఉన్నవారికి కూడా మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతోంది. అలాగే గదులకు డిమాండ్ కొనసాగుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్, లేపాక్షి సర్కిల్ ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది

విద్యార్థులకు ప్రశంసలు



విద్యార్థులను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 1(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ వెంకటేశ్వర్ సన్మానించారు. కలెక్టరేట్‌లో గురువారం సత్యవేడుకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, డక్కిలి, చిల్లకూరు విద్యార్థులను కలెక్టర్ సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. వారికి మార్గనిర్దేశం చేశారు.

వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వివాహితను వేధించిన ఘటనలో తిరుపతి రూరల్‌కు చెందిన చంద్రమౌళిపై సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు. ఆయన కథనం ప్రకారం.. 35ఏళ్ల వివాహిత తిరుపతి అక్కారంపల్లి రోడ్డులో నివాసముండగా పెరుమాళ్లపల్లినికి చెందిన చంద్రమౌళి వేధించేవాడు. వారం క్రితం ఆమె కుప్పరపల్లిలోని అత్తగారింట్లో ఉండగా వెళ్లి బెదిరించాడు. అడ్డుకున్న అత్తమామలను బెదిరించాడు. రూరల్ ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేశారు.

సర్వీసు రోడ్లలో భయం...భయం

● కనీస జాగ్రత్తలు తీసుకోని అధికారులు



సర్వీసు రోడ్డులో ఏవీ సూచిక బోర్డులు ?

చంద్రగిరి, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సర్వీసు రోడ్డులో స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఫ్లైఓవర్‌లో ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి, సర్వీసు రోడ్డు నుంచి అనుప్పల్లెకు వెళ్ళే మార్గంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీసు రోడ్డులో వాహనాలు అతివేగంగా నడపటం కూడా కారణమవుతోంది. బుధవారం బంకు వద్ద సర్వీసు రోడ్డు దాటుతుండగా వేగంగా ద్విచక్ర వాహనం వచ్చి ఢీ కొన్న ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సంతోష్‌కుమార్‌రెడ్డి మృతి చెందిన సంగతి తెలిసిందే. అగరాల సమీపంలో ఓవ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. సీ.మల్లవరం జంక్షన్ నుంచి గాందకి టోల్ ప్లాజా వరకు ఉన్న సర్వీసు రోడ్డులో స్పీడు బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. చంద్రగిరి నుంచి మామండూరు వరకు మార్గ మధ్యలో మూడు విద్యా సంస్థలు ఉన్నాయి. ఇక్కడి సర్వీసు రోడ్డులో స్పీడు బ్రేకర్లు వేయాలని ఇటీవల మండల సమావేశంలో అగరాల సర్పంచ్ భాస్కర్‌రెడ్డి కోరారు. అయినా జాతీయ రహదారి అధికారులు స్పందించలేదు. సర్వీస్ రోడ్డు నిబంధనలపై అవగాహన లేక వాహనచోదకులు ఇష్టానుసారంగా నడుపుతున్నారు. సర్వీసు రోడ్డుపైకి సమీప గ్రామ ప్రజలు రావాలంటే భయపడుతున్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయిస్తాం



సర్వీసు రోడ్డులో ప్రమాదాలు జరిగే స్పాట్లను గుర్తించి స్పీడు బ్రేకర్లు వేయాలని జాతీయ రహదారి అధికారులను కోరుతాం. సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటుకు కృషి చేసాం. సర్వీసు రోడ్డులో ఎటు వైపు వెళ్ళాలో అవగాహన లేక కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీసు రోడ్డుపై అవగాహన కల్పిస్తాం.

-సుబ్బరామిరెడ్డి, సీఐ, చంద్రగిరి.

వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ఆరులైన్లగా విస్తరించినా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు బాగా విశాలంగా ఉండటంతో వాహనాలు చాలా వేగంగా దూసుకుపోతున్నాయి. వేగ నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకుంటే ప్రమాదాలు తగ్గుతాయి.

-చులిపాటి హేమాద్రి, ఏజీపల్లె

మామిడి వ్యాపారి దారుణహత్య

● ఆర్థిక లావాదేవీలే కారణమా?



అశోక్ కుమార్ (ఫైల్‌ఫొటో)



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న అనిత

పాకాల, మే 1 (ఆంధ్ర జ్యోతి): పాకాల మండలం దామలచెరువుకు చెందిన మామిడి వ్యాపారి సత్రసాల అశోక్ కుమార్ (52) గురువారం ఉదయం దారుణహత్యకు గురయ్యారు. మొగరాల-దామలచెరువు రోడ్డు గల్లావాళ్ల మామిడితోపు దగ్గర ఈ ఘటన జరిగింది. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న తన భార్య అనితను ద్విచక్ర వాహనంలో కొత్తపేటలో వదిలి తిరిగి వస్తుండగా దుండగులు రాతితో బలంగా దాడి చేశారు. కిందపడిన ఆయన్ను విచక్షణారహితంగా కత్తితో నరికారు. తల, కాళ్లు, చేతులు, గొంతుపై పలుసార్లు కత్తితో పొడిచి చంపారు. హత్యకు గురైన అశోక్ కుమార్ దామలచెరువులో మెడికల్ షాపు నిర్వహిస్తుంటారు. దాంతో పాటు పెద్ద ఎత్తున మామిడికాయల వ్యాపారం చేస్తారు. పలువురితో ఈయనకు వ్యాపార, ఆర్థిక లావాదేవీలున్నాయి. స్థానికంగా పలువురికి అప్పులు ఇస్తుంటారు. ఈ వివాదాల నేపథ్యంలోనే హత్య జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మాస్కులు ధరించిన నలుగురు వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పట్టపగలు నడిరోడుపై హత్య చేయడం స్థానికంగా సంచలనం రేపింది. తనను వదిలిన కాసేపటికే భర్త హత్యకు గురయ్యాడని తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న అనిత బోరున విలపించారు. సీఐ సుదర్శన్ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, పోలీస్ డాగ్స్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసు డాగ్స్ కొంతదూరం వెళ్లి ఆగిపోయాయి. హత్యకు గల కారణాలు, పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

సానిపాయ రేంజ్‌కి జంట ఏనుగులు



గ్రామస్థులను అప్రమత్తం చేస్తున్న ఏటీఎఫ్ సిబ్బంది

ఎర్రావారిపాలెం, మే1(ఆంధ్రజ్యోతి):తలకోన అటవీ సమీప గ్రామాల్లో సంచరిస్తున్న జంట ఏనుగులు అన్నమయ్య జిల్లా సానిపాయ ఫారెస్ట్ రేంజ్‌లోకి ప్రవేశించినట్లు అటవీశాఖ చామల రేంజ్ ఆఫీసర్ ఎన్ వెంకటరమణ తెలిపారు. గురువారం ఉదయం మండలంలోని చింతగుంట,కూరపర్తి వారిపల్లి, కోటకాడపల్లె మీదుగా అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం సమీప దిన్నెల అడవిలోకి ప్రవేశించినట్లు డ్రోన్ల ద్వారా గుర్తించామన్నారు. తలకోన అటవీ సమీప గ్రామాల్లో ఏనుగుల సంచార నియంత్రణకు రెండు ఏటీఎఫ్ టీములు పనిచేస్తున్నాయన్నారు. కోటకాడపల్లె సమీపాన సిద్ధలగండి ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండటంతో సానిపాయ వైపు వెళ్లిన ఏనుగులు తిరిగి ఒకటి రెండు రోజుల్లో ఇటు వైపుగా వచ్చే అవకాశముందన్నారు. బాలపల్లె రేంజ్‌లోని ఏనుగులు కూడా తలకోన సౌత్ అడవికి వచ్చే సూచనలున్నాయన్నారు.

కొనసాగుతున్న గజదాడులు

పాకాల, మే 1 (ఆంధ్రజ్యోతి): గానుగపెంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆరు రోజులుగా పంటపొలాలపై అడవి ఏనుగులు దాడిచేస్తున్నాయి.బుధవారం రాత్రి చిన్నపాపయ్యగారిపల్లె పరిసరాల్లో మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. పైపులైన్లు తొక్కేశాయి. రైతులు పి.కృష్ణకుమారి, టి.బాలగురుస్వామి, లక్ష్మమ్మ, మంజులకు చెందిన మామిడి తోటలను నష్టం కలుగజేశాయి.

ఉద్యోగి ఇంట్లో పట్టపగలే చోరీ

● 190 గ్రాముల బంగారం, వెండి,నగదు అపహరణ



చిందర వందరగా బీరువా

తిరుచానూరు, తిరుపతి(నేరవిభాగం) మే 1(ఆంధ్రజ్యోతి): పట్టపగలే దొంగలు చెలరేగిపోయారు. ఓ ప్రైవేటు ఉద్యోగి ఇంట్లో రూ.20లక్షలు అపహరించుకుపోయారు. ఎస్ఐ సాయినాథ్‌చౌదరి కథనం ప్రకారం బ్రాహ్మణపట్టు పంచాయతీ కొత్తూరులో కుమారరాజా కుటుంబం ఉంటోంది. అతను ఓ ప్రైవేటు విద్యాసంస్థలో పనిచేస్తున్నారు. భార్య ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్ నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు మెయిన్‌డోర్ గడియ తొలగించారు. బీరువాలో సుమారు 220 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంతనగదు దోచుకెళ్లారు. కుమారరాజ తల్లి ఇంటికి వచ్చి చూడగా తలుపు తెరచి ఉంది. లోపల బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో కొడుకు, కోడలికి ఫోన్ చేసింది. వారు ఇంటికి చేరుకుని చోరీ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్‌చౌదరి, క్లూస్‌టీం సిబ్బంది పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు. నిందితుల క్లూస్ రాబట్టినట్లు తెలిసింది.

సీబీఎస్‌లో ప్రయాణికుల అవస్థలు

● బస్సులు అమరావతికి వెళ్లడంతో తప్పని నిరీక్షణ



బస్‌ల కోసం ప్రయాణికుల పడిగాపులు

తిరుపతి(ఆర్టీసీ), మే 1(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులో గురువారం ప్రయాణికుల రద్దీ కనిపించింది. కార్మిక దినోత్సవం సెలవు కావడంతో రాకపోకలు అధికంగా ఉన్నాయి. పైగా శుక్రవారం సాయంత్రం అమరావతిలో ప్రధాని మోదీ బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు తిరుపతి(145బస్సులు), చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి 300 బస్సులు తీసుకెళ్లారు. ఈ బస్సులు ప్రతినిత్యమూ సీబీఎస్ కేంద్రంగా వివిధ ఊర్లకు నడుస్తాయి. వాటిని దారిమళ్లించడంతో బస్సుల కొరత పెరిగి ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. ముఖ్యంగా మదనపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి, తలకోన, భాకరాపేటకు బస్సుల కొరత ఉంటుంది. ఉన్న వాటిలోనూ కోత విధించడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అప్పుడప్పుడు వచ్చే బస్సుల వెంట పరుగులు తీస్తూ సీట్లకోసం పోటీపడ్డారు. ముందుగా ప్రకటించకపోవడంతో ప్రతిసారీ ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కాణిపాకం, శ్రీకాళహస్తి ప్లాట్‌ఫామ్స్ వద్ద కూడా రద్దీ కనిపించింది. బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు ఇతర ప్లాట్‌ఫామ్స్‌లో ఖాళీ ఉన్న బస్సులను గుర్తించి రద్దీ ప్రాంతాలకు పంపడంతో కొంతవరకు ఊరట లభించింది. శుక్ర, శనివారాలలోనూ ఇదే పరిస్థితి ఏర్పడనుంది. ఆదివారం నుంచి పూర్తిస్థాయిలో బస్సులు అందుబాటులో ఉంటాయి.

అనంతాళ్వార్ అవతారోత్సవాలు ప్రారంభం

తిరుపతి అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం మధురకవి అనంతాళ్వార్ అవతారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లు అనంతాళ్వార్ సన్నిధికి వేంచేసి భక్తులను అనుగ్రహించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

ప్రొఫెసర్ తిరుపతిరెడ్డి బదిలీ

తిరుపతి(వైద్యం), మే 1(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల అనుసంధానం రుయా చిన్నపిల్లల విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ తిరుపతిరెడ్డిని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ చేస్తూ గురువారం వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని కుంట్రపాకం చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. తనపల్లి గ్రామానికి చెందిన మునిరత్నం(40) కాలు జారి చెరువులో పడ్డాడు. బురదలో ఇరుక్కుని బయటకు రాలేక మృతి చెందాడు. మృతదేహం నీటిపై తేలియాడుతూ ఉండడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదూ అందలేదని సీఐ సునీల్‌కుమార్ చెప్పారు.

మామపై అల్లుడు దాడి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మామపై అల్లుడు దాడి చేసిన ఘటన గురువారం లక్ష్మీపురం వద్ద చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. లక్ష్మీపురం సర్కిల్‌లో కాపురమున్న మోహన్ కుమార్తె శ్వేతను చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. వారిద్దరి మధ్య గొడవ రావడంతో ఆమె పుట్టింటికి చేరింది. గురువారం శ్వేతను తీసుకుని వెళ్లడానికి చిరంజీవి అత్తగారింటికి వచ్చాడు. ఈ సందర్భంగా మామ, అల్లుడు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చిరంజీవి మోహన్‌ను కర్రతో కొట్టి గాయపరిచాడు.

7న కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

తిరుపతి(ఆటోనగర్), మే1(ఆంధ్రజ్యోతి): కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను ఈ నెల 7న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ శెట్టి, డి.నరసింహులు మాట్లాడుతూ అమ్మవారికి వాసవీవ్రతం, శక్తిపీఠ, కన్నికల పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులను నమ్మకండి

● తిరుమలకు వచ్చే మహిళా భక్తులకు పోలీసుల సూచన



తిరుమలలో మినీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మహిళకు గాజులు కొనిస్తూ మాయమాటలు చెప్తున్న నాగరాజు (సీసీ టీవీ ఫుటేజీ)

తిరుమల, మే 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే మహిళలు గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి మోసపోవద్దని వన్‌టౌన్ ఎస్ఐ రమేష్ కోరారు. తిరుమలలోని పోలీస్‌కాంప్లెక్స్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమిళనాడులోని మదురైకి చెందిన మురుగన్ నాగరాజు తిరుమలకు వచ్చే అమాయక మహిళలను టార్గెట్ చేసి మాంగల్యపూజ పేరుతో నమ్మించి బంగారు ఆభరణాలను దోచుకుపోతున్నాడని వివరించారు. 35 ఏళ్లుగా ఈ తరహా దోపిడీకి పాల్పడుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. 1987లోనే సీసీఎస్‌లో ఓ కేసు, 2016లో మరో కేసుతో పాటు తాజాగా మూడు కేసులు అతడిపై నమోదైనట్లు తెలిపారు. నాగరాజును పట్టుకునేందుకు ఎస్పీ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించడంతో కేసును వేగవంతంగా పూర్తిచేశామన్నారు. దాదాపు 132 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని తిరుపతి కోర్టులో హాజరుపరిచామని వివరించారు. ఈ క్రమంలో తిరుమలకు వచ్చే మహిళలు గుడ్డిగా ఎవరినీ నమ్మొద్దని, ఇలాంటి వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా, నాగరాజు మహిళలను మోసగిస్తున్న సీసీ టీవీ దృశ్యాలను ఆయన విడుదల చేశారు.

పేదలను ఆదుకోవడానికే పెన్షన్లు

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం కొర్లగుంట సంజయ్ గాంధీ కాలనీలోని రామాలయం వద్ద 8, 9 డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచి ఇస్తున్న ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. తిరుపతిలో 18,666 మందికి రూ.8.20కోట్లు అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రూ.రెండు వేల నుంచి మూడు వేలకు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని విమర్శించారు. బటన్ నొక్కుడు పేరుతో సగం మందికి పెన్షన్లు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నేత మన్నెం శ్రీనివాసుల నాయుడు పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాల అధ్యాపకులకు అదనపు బాధ్యతలు


వినోద్‌కుమార్, రాంబాబునాయక్, లక్ష్మీకవిత

తిరుపతిరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలలో పలువురు అధ్యాపకులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ,డీఎస్‌ఏ ప్రొఫెసర్ జేవీ రమణ ఉత్తర్వులు జారీ చేశారు. బాలుర, బాలికల హాస్టల్స్ వార్డెన్లుగా డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ కె.లక్ష్మీకవిత, ఓఎస్‌ఏగా డాక్టర్ ఎన్.వినోద్‌కుమార్, యూజీ, పీజీ అకడమిక్స్ విభాగాలకు డాక్టర్ ఆర్.వేణు, డాక్టర్ జి.గంగరాజు, ప్లేస్‌మెంట్స్ సెల్ అధికారిగా డాక్టర్ కె.సుధీర్, అడిషనల్ వార్డెన్లుగా డాక్టర్ ఇ.తిరుపతిరెడ్డి(బాలురు), డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్ఫూర్తి (బాలికల), ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లుగా డాక్టర్ టీవీ చైతన్యకుమార్, డాక్టర్ ఎస్.శ్వేతక్రాంతి, డాక్టర్ ఎ.తేజ, డాక్టర్ సీఎస్ శ్వేతలను నియమించినట్లు పేర్కొన్నారు. వీరు ఏడాదిపాటు ఈ పదవుల్లో కొనసాగుతారు.

పోస్టర్ ప్రజెంటేషన్‌పై పోటీ


పోటీలో పాల్గొన్న ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 1 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) ఆధ్వర్యంలో పోస్టర్ ప్రజెంటేషన్‌పై పోటీలు నిర్వహించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. నిపుణులు పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ మాట్లాడుతూ కొత్తగా వ్యాపార ప్రణాళికను రూపొందించుకోవడం, వ్యాపారాన్ని ప్రారంభించడం, నిర్వహించడం, ప్రయోజనాలు వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీన్ని విద్య, పరిశోధన వంటి అంశాలకు కూడా అన్వయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐఈ మాజీ మేనేజర్ శ్వేతకుమారి, సభ్యులు అనిత, స్నేహలత, నాగరాజు, శోభారాణి, లత, రజిత పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


సుధాకరబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు),మే1(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మనో విజ్ఞాన శాస్త్ర విభాగ పరిశోధకులు ఎస్.సుధాకర బాబు డాక్టరేట్ పొందారు. ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో సాధన, ప్రేరణపై అభిజ్ఞా శైలుల ప్రభావం - స్వీయ సామర్థ్యం అంశంపై ప్రొఫెసర్ ఎల్.కుళ్లాయి రెడ్డి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించారు. సుధాకరబాబు పలు సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయన రాసిన పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

ఈ మురుగుకు దారేదీ?

భవానీనగర్ సర్కిల్లో పొంగుతున్న డ్రైనేజీ



తిరుపతి, మే1 (ఆంధ్రజ్యోతి) : భవానీనగర్ కూడలిలో తరుచూ మురుగు పొంగిపారుతోంది. దీంతో వాహనదారులతో పాటు దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజన్న పార్కు నుంచి భవానీనగర్ సర్కిల్ వరకు ఎక్కడ మ్యాన్‌హోల్ పొంగినా మురుగు సర్కిల్ నుంచి కింది వరకు పారుతోంది. గురువారం కూడా భవానీనగర్‌లో పొంగుతున్న డ్రైనేజీ వలన దుర్గంధంతో అసౌకర్యానికి గురవుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షుడు మక్కిన భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ ఎదురుగా మేడే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శ్రీనివాసులు కార్మికులకు టీషర్ట్స్, పండ్లు పంపిణీ చేశారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర

తిరుపతి (విశ్వవిద్యాల యాలు), మే 1 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. సీఐటీయూ అనుబంధ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎస్వీయూలో చేపట్టిన మేడేలో ఆయన పాల్గొని ఎర్రజెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, నాయకులు గండికోట నాగవెంకటేష్, రవి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ర్యాలీ

తిరుపతి అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా శ్రీబాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు తంగవేలు మేస్త్రీ ఆధ్వర్యంలో గురువారం కొర్లగుంటలో జెండా ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మళ్లకుప్పం శేఖర్, అల్లాబక్షు, చిరంజీవి, రమణ, బండి సుబ్రహ్మణ్యం, జగన్నాథం, రమణ, కుప్పరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల మేడే వేడుకలు



తిరుపతి, మే1(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికులు మేడే వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. వినాయకసాగర్ వద్దగల గ్యారేజ్ వద్ద కార్మిక సంఘ నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్మికులు వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఒకరికొకరు మేడే శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం

వాడవాడలా మేడే వేడుకలు




జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు - ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి(ఆటోనగర్), మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలో వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు గురువారం వాడవాడలా ర్యాలీలు, పతాకావిష్కరణలు చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ, బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ నాయకులు పతాకాలను ఆవిష్కరించారు. పారిశ్రామికవాడల్లో ఎర్రజెండాలను ఎగురవేశారు. ర్యాలీలు నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు కందారపు మురళి, పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ 139 ఏళ్ల క్రితం వేలాది మంది కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న 8 గంటల పనిదినాలను కాలరాసేందుకు కార్మిక చట్టాలను, హక్కులను సవరించి లేబర్‌కోడ్‌లుగా మార్చారన్నారు. వాటి రద్దు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీ కాలనీలోని ఇందిరానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ కార్యలయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు మునిరాజ, జయచంద్ర, సుబ్రమణ్యం, మాధవ్, సాయిలక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, పద్మజ, రఫీ, శ్రీనివాసులు, బాలాజీ, తులసేంద్ర, రాధాకృష్ణ, ఎన్‌డీ రవి, శివ, సురేష్, బాల, విశ్వనాథ్, శివకుమార్, పెంచలయ్య పాల్గొన్నారు.

రుయా, ప్రసూతి ఆస్పత్రుల్లో కార్మిక దినోత్సవం


ప్రసూతి ఆస్పత్రి ముందు జెండా ఎగుర వేస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి (వైద్యం), మే (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల, రుయా, ప్రసూతి ఆస్పత్రుల్లో గురువారం ఏఐటీయూసీ, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రుల ఆవరణలో జెండాను ఎగురవేసి, కార్మికుల హక్కుల గురించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్‌రెడ్డి వివరించారు. ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గిరిబాబు ఆధ్వర్యంలో రుయాస్పత్రి ఆవరణలో ప్రైవేటు అంబులెన్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో...

ఈఎస్ఐ ఆస్పత్రిలో కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు జెండా ఆవిష్కరించి, కార్మికులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డాక్టర్లు శ్రీధర్, పద్మావతి, మహేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ అమ్ములు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కుమారమ్మ - అన్నా అనిత

పారిశుధ్య కార్మికులకు సన్మానం

తిరుపతి(జీవకోన), మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికులే అభివృద్ధిలో భాగస్వాములని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ అన్నారు. మేడే సందర్భంగా జీవకోనలోని రాజీవ్‌గాంధీ కాలనీలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంచిపెట్టారు. 48వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సన్మానించి, స్వీట్లు పంచిపెట్టారు.

మోక్ష మార్గాన్ని ఉపదేశించిన రామానుజాచార్యులు


భక్తి ప్రవచనాలు ఉపదేశిస్తున్న రాఘవన్

తిరుపతి అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): సామాన్యులకు మోక్ష మార్గాన్ని ఉపదేశించిన తాత్వికవేత్తగా, సామాజిక సంస్కర్తగా భగవద్ రామానుజాచార్యులు నిలిచిపోయారని కె.టి.వి.రాఘవన్ ఉద్ఘాటించారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమార్య కళామందిరంలో గురువారం సాయంత్రం రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు రెండవ రోజూ కొనసాగాయి. ఆయన ఉపదేశిస్తూ రామానుజాచార్యులు సాక్షాత్తు ఆదిశేషుని అంశ అన్నారు. గోవిందరాజస్వామి, తిరుమల శ్రీవారి ఆలయాల్లో నిర్వహించే నిత్య కైంకర్యాలలో ఆయన స్థాపించిన వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అనంతరం ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వేంకటేశ్వర్లు హరికథా గానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు అధికారి పురుషోత్తం పాల్గొన్నారు.

జాతర భద్రతపై ఎస్పీ సమీక్ష

తిరుపతి(నేరవిభాగం), మే 1 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతర భద్రతపై గురువారం ఎస్పీ హర్షవర్ధన రాజు పోలీసు అధికారులతో సమీక్షించారు. రద్దీకి అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. వారం రోజుల పాటు గుడిలో విధులు కేటాయించిన పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 12, 13 తేదీల్లో ఆలయానికి చేరుకునే మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

తిరుమల భద్రతపై ప్రత్యేక దృష్టి

తిరుపతి(నేరవిభాగం), మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టీటీడీ సీవీఎస్‌వో హర్షవర్ధన రాజు పేర్కొన్నారు. తిరుపతిలోని కమాండ్ కంట్రోలు రూములో గురువారం విజిలెన్సు, ఆక్టోపస్, ఇంటెలిజెన్సు అధికారులతో ఆయన సమీక్షించారు. తిరుమలలో అనుమతి లేని హాకర్లను కిందకు దించాలని ఆదేశించారు. ఘాట్ రోడ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను పరిశీలించాలన్నారు. నేరస్థుల షెల్టర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతి (ఆటోనగర్), మే1 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టాలని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర నాయకులు రాజ్‌పఠాన్, రాజేశ్వర్‌రావు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు పోరుబాట ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తామని ప్రకటించి మోసం చేసిందన్నారు. పైగా ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసిందన్నారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ తమ ప్రభుత్వం రాగానే సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పినా ఇప్పటివరకు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా లాభం లేకపోయిందని, స్పందించని పక్షంలో ఆందోళనకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రామాంజనేయులు, పవన్, వెంకటరత్నం, జి.రేఖ, చీర్లకిరణ్ పాల్గొన్నారు.

తెలుగు 'గంగ' నేలపాలు


ట్యాంక్ నుంచి పోతున్న నీరు

తిరుపతి అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని రా వాటర్ సరఫరా కేంద్రంలో తెలుగుగంగ నీరు నేలపాలవుతోంది. రా వాటర్ స్టోరేజ్ ట్యాంకు పూర్తిగా నిండి ఓవర్‌ఫ్లో అవుతోంది. అక్కడ పనిచేసే సిబ్బంది పట్టించుకోకపోవడంతో గంటల తరబడి నీరు పోతూనే ఉంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి


మెకానిక్స్‌కు సర్టిఫికెట్స్ అందజేస్తున్న కూటమి నేతలు

తిరుపతి అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కూటమి నేతలు భరోసా ఇచ్చారు. శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం యూత్‌హాస్టల్లో మేడే వేడుకలు నిర్వహించారు. 60మంది ట్రస్టు సభ్యులు ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకుకు రక్తదానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీధర్‌వర్మ, బుల్లెట్ రమణమెకానిక్‌ల శ్రమను కొనియాడుతూ వారి అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. రక్తదానం చేసిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్, సభ్యులు ఎస్ఆర్ బాషా, హరిప్రసాద్, చందు, షఫీ, ఆనంద్, ఎ.ఎం.గోపి పాల్గొన్నారు.

పక్షులకు నీరు, ఆహారం

ఏబీవీపీ ఆధ్వర్యంలో సేవ్ బర్డ్ కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయా లు), మే 1 (ఆంధ్రజ్యోతి): సేవ్ బర్డ్ - సేవ్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని ఏబీవీపీ చేపట్టింది. ఎండ తీవ్రతకు అల్లాడిపోయే పక్షులకు ఆహారం, నీరు అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరుపయోగంగా పడి ఉన్న ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లలో ఆహారం, నీళ్లు నింపి చెట్లకు అమర్చే కార్యక్రమం ఎస్వీయూలో గురువారం సాగింది. ఈ కార్యక్రమానికి స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్ సహకారం అందించింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు రమణయ్య, లక్ష్మీనారాయణ, పూజారి రాఘవేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(కలెక్టరేట్), మే 1(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాల పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం వంటి విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.




కృష్ణతేజ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం జరిగిన తన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ ఛైర్మన్, సీబీఎస్ తేజ కృష్ణమూర్తి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి. ఈ కార్యక్రమంలో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు, సుమలత దంపతులు, తిరుమల ఆయిల్ డిస్ట్రిబ్యూటర్స్ తిరుపతి ఎండీ జెట్టి సతీష్, జెట్టి కవిత తదితరులు పాల్గొన్నారు. చదలవాడకు పలువురు నేతలు, విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'సాగరమాల' పరిహారం కోసం రైతుల నిరసన

నాయుడుపేట, మే 1(ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు కోసం భూము లిచ్చిన తమకు ఇంతవరకు పరిహారం అందలేదంటూ నాయుడుపేట మండలం కాపులూరు గ్రామానికి చెందిన రైతులు గురువారం నిరసన తెలిపారు. సాగరమాల రోడ్డుకు కాపులూరు గ్రామానికి చెందిన 23మంది రైతులు పది ఎకరాల భూమి ఇచ్చామని, అయితే ఇంతవరకు పరిహారం అందించలేని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పరిహారం చెల్లించకుంటే సాగరమాల రోడ్డు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దారు రాజేంద్ర రైతులతో మాట్లాడు తూ 15 రోజుల్లో పరిహారం అందజేస్తామని చెప్పారు.

విహారయాత్రలో విషాదం

కృష్ణా ఘాట్‌లో వెంకటగిరి బాలుడి మృతి

వెంకటగిరి, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విహార యాత్రకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన విజయవాడ కృష్ణా ఘాట్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.... వెంకటగిరికి చెందిన ఆకుల నరసింహారావు కుమారుడు మురళి(14) 9వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో రెండు రోజుల క్రితం మురళి తన మేనత్త సుభాషిణితో కలిసి విహార యాత్రగా విజయవాడకు వెళ్లాడు. బుధవారం కృష్ణా ఘాట్‌లో స్నానానికి వెళ్లిన మురళి ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతి చెందాడు.

ఈతకెళ్లి యువకుడి మృతి

చిట్టమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లంపర్తి గ్రామానికి చెందిన బట్టా నవీన్(23) ఈతకెళ్లి గుంతలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... నవీన్ తడలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. గురువారం మేడే సందర్భంగా సెలవు కావడంతో స్నేహితుడు నాగార్జునతో కలసి ఊరిబయట ఉన్న గుంతలో ఈత కొట్టేందుకు వెళాడు. గుంతలోకి దూకిన నవీన్ బయటకు రాకపోవడంతో నాగార్జున గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామ స్తులు వచ్చేటప్పటికే నవీన్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

మామిడి వ్యాపారి దారుణహత్య

● ఆర్థిక లావాదేవీలే కారణమా?



అశోక్ కుమార్ (ఫైల్‌ఫొటో)

పాకాల, మే 1 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువుకు చెందిన మామిడి వ్యాపారి సత్రసాల అశోక్ కుమార్ (52) గురు వారం ఉదయం దారుణహత్యకు గురయ్యారు. మొగరాల-దామలచెరువు రోడ్డు గల్లావాళ్ల మామి డితోపు దగ్గర ఈ ఘటన జరిగింది. హెల్త్ డిపార్ట్ మెంట్‌లో పనిచేస్తున్న తన భార్య అనితను ద్విచక్ర వాహనంలో కొత్తపేటలో వదిలి తిరిగి వస్తుండగా దుండగులు రాతితో బలంగా దాడి చేశారు. కిందపడిన ఆయన్ను విచక్షణారహితంగా కత్తితో నరికారు. తల, కాళ్లు, చేతులు, గొంతుపై పలుసార్లు కత్తితో పొడిచి చంపారు. హత్యకు గురైన అశోక్ కుమార్ దామలచెరువులో మెడికల్ షాపు నిర్వహిస్తుంటారు. దాంతో పాటు పెద్ద ఎత్తున మామిడికాయల వ్యాపారం చేస్తారు. పలువురితో ఈయనకు వ్యాపార, ఆర్థిక లావాదేవీలున్నాయి. స్థాని కంగా పలువురికి అప్పులు ఇస్తుంటారు. ఈ వివాదాల నేపథ్యంలోనే హత్య జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మాస్కులు ధరించిన నలుగురు వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పట్టపగలు నడిరోడుపై హత్య చేయడం స్థానికంగా సంచలనం రేపింది. తనను వదిలిన కాసేపటికే భర్త హత్యకు గురయ్యాడని తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న అనిత బోరున విలపించారు. సీఐ సుదర్శన్ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. క్లూస్ టీం, పోలీస్ డాగ్స్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసు డాగ్స్ కొంతదూరం వెళ్లి ఆగిపోయాయి. హత్యకు గల కారణాలు, పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత

● వాటిలో 300 ఎర్రచందనం దుంగలు మాయం

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



ఎర్రచందనం చెట్టును నరికి చిన్న దుంగ కావడంతో వదిలేశారిలా - ఎర్రచందనం మొదలు నరికిన దృశ్యం

రేణిగుంట, మే 1 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డొస్తున్నాయంటూ అటవీ ప్రాంతంలో వెయ్యి చెట్లు నరికే యగా.. వాటిలో ఎర్ర చందనం చెట్లకు సంబంధించి 300 దుంగలు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట- మామండూరు ప్రధాన రహదారిలో చైతన్యపురం రాస్ భవనం 9 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు పక్కన అటవీ ప్రాంతంలో 133 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. వీటికి చెట్లు అడ్డం వస్తున్నాయని గత నెలలో అటవీ ప్రాంతంలోని తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో విద్యుత్ శాఖ సిబ్బంది భారీగా చెట్లను నరికేశారు. వీటిలో 300 ఎర్రచందనం దుంగలు మాయమైనట్లు తెలిసింది. అక్కడక్కడ ఎర్రచందనం చెట్లను నరికి చిన్న దుంగలు కావడంతో వదిలి వెళ్లడంతో గుట్టు రట్టయింది. దీనిపై జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్‌ను వివరణ కోరగా తాము మామండూరులో ఏనుగుల సంచారాన్ని పరిశీలించేందుకు గత నెలలో వెళ్లగా చెట్లు కొట్టి వేయడాన్ని గుర్తించామన్నారు. ఇందులో ఎర్రచందనం చెట్లూ ఉన్నట్లు తెలిపారు. తమ అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలో విద్యుత్ శాఖ అధికారులు చెట్లు నరికివేయడంపై ఇది వరకే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న డివిజన్ రేంజ్ ఆఫీసర్ గౌస్‌ను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

రాళ్లకుప్పం వద్ద రైతుల ధర్నా



సత్యవేడు, మే 1 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం రాళ్లకుప్పం వద్ద శ్రీసిటీకి వెళ్లే దారిలో మూడు గ్రామాల రైతులు గురువారం ధర్నా చేశారు. జిలా సర్వేయర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది భూసర్వేకు కొల్లడం రావడంతో ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాక్కం రైతులు అడ్డుకుని, ధర్నా నిర్వహించారు. భూసేకరణ జీవోను రద్దు చేయాలని డిమాండు చేశారు. శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, సత్యవేడు తహసీల్దార్ రాజశేఖర్ రైతులతో మాట్లాడుతూ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని, ధర్నా విరమించాలని కోరారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాళవ్యానగర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీ సీట్ల భర్తీకి అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. 3వ తరగతిలో ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు 1 సీటు ఖాళీ ఉన్నాయి. అలాగే 4వ తరగతిలో 31, 5లో 28, 6లో 9, 8లో 1 సీట్లకు ఎస్టీ విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9441766714, 8885372878 నంబర్లును సంప్రదించాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోట, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు బాలికల ఐటీఐలో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అద్దంకి రాజేశ్వరరావు కోరారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్ 24, ఎలక్ట్రీషియన్ 20, ఫిట్టర్ 20, మెకానిక్స్ 24, మెకానిక్ డీజిల్ 48, వెల్డర్ 40సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 25వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 24 నుంచి జూన్ 26వరకు సర్టిఫికెట్ల పరిశీలిస్తామని, జూన్ 2నుంచి 10వ తేదీ వరకు కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 8008583423, 8498066674 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.





ఒకే గదిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు - నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాని భవనం

ఇరుకు గదిలో ఎనిమిది మంది

తాళ్వాయిపాడు సచివాలయ సిబ్బంది పాట్లు

పెళ్లకూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని తాళ్వాయి పాడు పంచాయతీ కార్యాలయానికి ఒకే గది ఉంది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చాక పంచాయతీ కార్యాలయ గదిలోనే గ్రామ సచివాలయం కూడా ఏర్పాటు చేశారు. అనంతరం సచివాలయానికి నూతన భవనం నిర్మించేందుకు అనుమతి మంజూరు చేశారు. నూతన సచివాలయ నిర్మాణం చేపట్టి దాదాపుగా పూర్తి చేసినప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ భవనాన్ని అప్పగించలేదు. దీంతో పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదిలో అసౌకర్యాల నడుమ ఎనిమిది మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీహరి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే నూతన భవనంలోకి మారతామని చెప్పారు.

పుత్తూరు వార్తలు

కార్మిక చట్టాలను కాపాడుకుందాం



జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పుత్తూరు టౌన్, మే 1: కార్మిక చట్టాలను కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. గురువారం పుత్తూరు పట్టణంలో మేడే సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామచంద్రయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో పలు చోట్ల కార్మిక జెండా ఎగరవేసి, సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ఎర్రజెండా పోరాట ఫలితమే నేటి 8 గంటల పనిదినంగా గుర్తిస్తున్నట్లు చెప్పారు. రాబోయే కాలంలో కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఉద్యోగ, కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్, భాస్కర్, విజయ్‌కుమారి, మునికుమారి, రాధ, లలిత, అంబికా, పద్మజ, లక్ష్మి, హైమావతి, ప్రమీల, ఏఐటీయూసీ నాయకులు విజయ్‌కుమార్, ముని, మోహన్, గోపి, ఆటో యూనియన్ అధ్యక్షుడు మణి, శ్రీరాములు, రమణ, ముని తదితరులు పాల్గొన్నారు.



కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

● వడమాలపేట: కార్మికుల సమస్యలను ఉమ్మడి ప్రభుత్వం పరిష్కరించే దిశగా ఆలోచించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మునిరాజు, అంగన్వాడీ నాయకులు విజయకుమారి, మునికుమారి, గంగులమ్మ, కృష్ణవేణి, జయంతి, అరుణ, అహల్య, శైలు, వసంత తదితరులు పాల్గొన్నారు.

కొళాయిల్లో రంగునీరు



నగరి, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ కొళాయిల్లో తాగునీటికి బదులు రంగునీరు వస్తోందని ఏకాంబరకుప్పం వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో తరచూ ఇలాంటి నీరే వస్తున్నట్లు తెలిపారు. తాగునీటిలో ఎక్కడ రంగు కలుస్తుందో పరిశీలించి మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎకో టూరిజంగా మూలకోన జలపాతం



కొండల నుంచి జాలువారుతున్న జలపాతం



విశాలమైన నీటిగుంట, గుంటలో మంటపం, ముందు శివాలయం



రాతి గుండు కింద ప్రతిష్ఠించిన శివలింగం

పుత్తూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలోని మూలకోన జలపాతాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా గుర్తించడంతో అటవీశాఖ ఆధ్వరంలో ఎకో టూరిజంగా వేగంగా రూపుదిద్దుకుంటోంది. పుత్తూరు పట్టణం నుంచి తొరూరు, గోపాలకృష్ణాపురం గ్రామాల మీదుగా దాదాపు 20కిలోమీటర్లు దూరంలో మూలకోన జలపాతం ఉంది. తూర్పు, ఉత్తరం కొండల నడుమ వున్న జలపాతం నుంచి ఏడాది పొడవునా నీళ్లు జలజల రాలుతుంటాయి. నీటి ప్రవాహం ఉండడంతో చుట్టుపక్కల ఏపుగా పెరిగిన పచ్చనిచెట్లు నేల మీద సూర్యకిరణాలు పడకుండా కమ్మేసి ఉంటాయి. ఆకుపచ్చని చెట్లు ఊగుతుండడంతో మిట్టమధ్యాహ్నం వేళ కూడా జలపాతం తుంపరులు కలిసిన చల్లని గాలి ఒంటిని తగిలి చెప్పలేని అనుభూతినిస్తుంది. వర్షాకాలంలో మరింత చల్లదనంతో ఆస్వాదనకు అంతులేదు. ఈ ఆనందాన్ని అనుభవించేందుకు చెన్నై, కర్ణాటక నుంచి కూడా పర్యాటకులు వెతుక్కుని ఈ ప్రాంతానికి వస్తున్నారు. ప్రస్తుతం రోజుకు వందల్లో, శెలవు రోజుల్లో వేలల్లో పర్యాటకులు వస్తున్నారు. ఈ మూలకోన జలపాతంలో ప్రతిఏటా శివరాత్రి నాడు శివభక్తులు భారీ సంఖ్యలో పర్యటిస్తారు. ఆ రోజు రాత్రి జలపాతం వద్ద విడిది చేసి మరుసటి రోజు తిరుగు పయనమవుతారు. పర్యాటకులు వంటలు చేసుకుని వనభోజనంగా స్నేహితులతో కలిసి గడుపుతున్నారు. శివరాత్రి జాగారంగా ఆలయ నిర్వాహకులు హరికథ గానంతో సందడి చేస్తారు. అన్నదానం కూడా పెద్ద ఎత్తున జరుగుతుంది. పర్యాటకుల రాకపోకలకు వీలుగా పుత్తూరు ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రతి అర్ధగంటకు బస్సులను ఏర్పాటు చేస్తారు. దీంతో కోన జనాలతో నిండిపోయి కేకలు అరుపులతో దద్దరిల్లిపోతుంది.

ఎకో టూరిజానికి ప్రాథమిక ఏర్పాట్లు చేస్తున్నాం

అటవీశాఖ ఎంపిక చేసిన ఈ మూలకోన ప్రాంతాన్ని ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించాం. ప్రకృతి, పర్యావరణం దెబ్బతినకుండా పర్యాటకులను ఆనందింపజేసేందుకు తగిన సన్నాహాలు చేస్తున్నాం. పర్యాటకుల సంఖ్య పెరిగే కొద్దీ మరింత అభివృద్ధి పనులు చేస్తాం. ఈ ప్రాంత అభివృద్ధి కోసం పర్యాటకుల నుంచి ప్రభుత్వ నిర్దేశించిన రుసుమును వసూలు చేసేందుకు చెక్‌పోస్టు కూడా ఏర్పాటు చేస్తున్నాం. పర్యాటకులకు పర్యావరణం మీద అవగాహన కల్పించేందుకు బోర్డులను కూడా పెడుతున్నాం. ప్రస్తుతం చేపట్టిన పనులు మరో వారం, పదిరోజుల్లో పూర్తవుతాయి. అప్పటి వరకు పనులకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు ఆ ప్రాంతానికి రాకూడదని నిషేధం విధించాం.

- ఎఫ్ఆర్‌వో మాధవి


వృద్ధాప్యంలో భరోసాగా పింఛన్ల పంపిణీ



పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, మే 1 (ఆంధ్ర జ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న వారికి భరోసా కల్పిస్తూ, వితంతువులకు కుటుంబ పోషణ నేపధ్యంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. గురువారం వడమాలపేటలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. జట్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ దయాసాగర్, టీడీపీ నాయకులు వెంకటయ్య, లక్ష్మీప్రసన్న, ఢిల్లీప్రసాద్, హేమావతి, కుమార్, శివారాయల్,గురునాథం బాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై ఊరేగిన సదాశివుడు



పుత్తూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలో వెలసినకామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఉదయం 7.30 నుంచి 8 గంటల మధ్య ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించి, ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, స్వామి అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి చంద్రప్రభ వాహనంపై పుత్తూరు పట్టణ పుర వీధులలో ఊరేగించారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిరసన



ఉగ్రదాడిలో మృతులకు నివాళులు అర్పిస్తున్న ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

పుత్తూరు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడటాన్ని దుర్మార్గపు చర్యగా ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీజీఈఏ) పేర్కొంది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. అంతకుముందు ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. ఉగ్రవాదం పేరుతో అమాయకుల ప్రాణాలను తీస్తున్న వారికి దేశం తగిన విధంగా బుద్ధి చెబుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రవికుమార్, సెక్రటరీ మోహన్‌బాబు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు గుణశేఖర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీహరి రాజు, ఉప కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాల బాలికలకు ఉచిత శిక్షణ

పుత్తూరు, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల(మెయిన్)లో బాలకేంద్రం ఆధ్వర్యంలో బాల బాలికలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలపై ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో 8 ఏళ్ల నుంచి 16 ఏళ్లలోపు వయసు కలిగిన విద్యార్థులు చేరవచ్చని, ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. నేటి నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే శిక్షణ తర్వాత సర్టిఫికెట్లను అందిస్తామని అన్నారు. ఈ శిక్షణ పర్యవేక్షణను ప్రభావతి నిర్వహిస్తారని తెలిపారు.

ఏనుగుల దాడిలో 500 మామిడి చెట్లు ధ్వంసం

● ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలంటూ మామిడి రైతుల వేడుకోలు



ఏనుగులు విరగ్గొట్టిన మామిడిచెట్టు (ఇన్‌సెట్‌లో) రాలిపోయిన మామిడి పండ్లు



రాత్రి సమయంలో ఏనుగులు నీరు తాగి వెళుతున్న కుంట

రేణిగుంట, మే 1(ఆంధ్రజ్యోతి): మామండూరులోని మామిడి తోపులపై ఏనుగుల మంద బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు పంటను ధ్వంసం చేశాయి. శేషాచలం అటవీ ప్రాంతంలో ఉన్న 20 ఏనుగుల మంద పగటిపూట ఎండల కారణంగా చెట్ల కింద సేదతీరి రాత్రయితే ఆహారం, నీటి కోసం సమీపంలోని మామిడి తోటల్లోకి ప్రవేశించి చేతికొచ్చిన పంటను ధ్వంసం చేస్తున్నాయి. ఈ సందర్భంగా మామిడి రైతులు ఖుషీదు, ఆదికేశవులు, పెద్దకాలేషా మాట్లాడుతూ మాముండూరు రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 130 ఎకరాల్లో మామిడి తోటలో కాసే మామిడి పండ్ల ద్వారా వచ్చే ఆదాయంతో ఏడాది పాటు జీవనం సాగిస్తున్నామన్నారు. గడిచిన 15 ఏళ్లుగా వేసవి కాలంలో ఏనుగుల మంద మామిడి తోపులోకి ప్రవేశించి మామిడి పండ్లను తిని, సమీపంలోని కుంటలో నీటిని తాగేసి వెళ్లేవని చెప్పారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 20 ఏనుగుల మంద మామిడి తోపులో బీభత్సం సృష్టించి 500 మామిడి చెట్లను ధ్వంసం చేశాయని, మామిడి పండ్లన్నీ నేల రాలిపోయాయన్నారు. ఇప్పటికే రూ.10 లక్షల పైనే నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకొని మామిడి తోపులకు సమీపంలో అటవీ ప్రాంతంలో పూడుకుపోయిన కందకాలను తవ్వించి ఏనుగుల దాడి నుండి మామిడి తోపును రక్షించాలని వేడుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్‌ను వివరణ కోరగా, మాముండూరులో మామిడి పండ్ల కోసం ఏనుగులు మామిడి తోపుల్లోకి వస్తున్నాయని, ఏనుగులను నియంత్రించేందుకు తిరుపతి సబ్ డీఎఫ్‌వోతో కలిపి ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు. అటవీ ప్రాంతం నుంచి మామిడి తోపులోకి ఏనుగులు వచ్చే సమయాన్ని, ప్రదేశాలను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి ఆ ప్రాంతంలో వారంలోపు కందకాలు తవ్విస్తామని ఆయన తెలిపారు. మామిడి రైతులు భవిష్యత్తులో నష్టపోకుండా ఉండేందుకు పంటను మార్చుకోవాలని ఆయన సూచించారు.



కృష్ణతేజ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం జరిగిన తన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్, సీబీఎస్ తేజ కృష్ణమూర్తి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి. ఈ కార్యక్రమంలో విడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు, తిరుమల ఆయిల్ డిస్ట్రిబ్యూటర్స్ తిరుపతి ఎండీ జెట్టి సతీష్, జెట్టి కవిత తదితరులు పాల్గొన్నారు. చదలవాడకు పలువురు నేతలు, విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



సినీ రంగానికి జీవితాంతం రుణపడి ఉంటాను: రోజా



సినీ కార్మికుల సమ్మేళంలో హీరో విశాల్, రోజా తదితరులు

పుత్తూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): సినీ జీవితంలో ఎదుగుదలకు సినీ కార్మికులు, నిర్మాతలు, డైరక్టర్లే ప్రధాన కారణమని నటి, మాజీ మంత్రి రోజా అన్నారు. మే డే సందర్భంగా చెన్నైలో దక్షిణ భారత సినీ కార్మికుల సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ తన ఎదుగుదలకు కారణమైన సినీ రంగానికి జీవితాంతం రుణపడి ఉంటానని చెబుతూ కార్మిక సంఘానికి రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. ఈ సమ్మేళనంలో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పథకాలను వర్తింపచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈఎఫ్ఎస్ఐ అధ్యక్షుడు సెల్వమణి, హీరో విశాల్ తదితరులు పాల్గొన్నారు.

20నుంచి ఎల్ఎల్ఎం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని లా కాలేజీల్లో నిర్వహిస్తున్న ఎల్ఎల్ఎం కోర్సు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల విభాగం గురువారం విడుదల చేసింది. 20 నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 1 నుంచి 9వ తేదీ దాకా గడువు విధించారు. 14వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ నిర్వహిస్తారని ఎస్వీయూ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే ఆదిమూలం



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్‌తో కలిసి మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. శిక్షణ జిల్లా కోఆర్డినేటర్లు పద్మ, సుమతి మాట్లాడుతూ మూడు నెలల పాటు టైలరింగ్ శిక్షణ ఉంటుందని, 80 రోజులపాటు శిక్షణకు హాజరైన వారికే కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లో టైలరింగ్ శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. ఏఈ ఇబ్రహీంఖాన్, ఈవోపీఆర్డీ తరుణాక్షరెడ్డి, ఉపాధి ఏపీవో విజయభాస్కర్, ఆర్ఐ సురేష్, నాయకులు పరమశివం, చికెన్ చిన్న, శివానందం, నాగరాజు యాదవ్, రమణ, శశి, జనసేన నాయకుడు బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ

పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ కాలనీలో గురువారం పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదిమూలం పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, ప్రత్యేక ప్రతిభావంతులు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, సెక్రటరీ మునిరవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా ప్రతి నెల లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తూకివాకం పంచాయతీలో కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువానిషాతో కలిసి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ స్వయంగా పలువురు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించి 2,61,230 మంది పింఛన్‌దారులకు సుమారు రూ.111.84 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. పింఛన్ అందిస్తున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఉదయాన్నే తమ ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందజేస్తున్నారని, తమకు ఎంతగానో ఆసరాగా ఉంటుందని కలెక్టర్‌కు తెలిపారు. తూకివాకం గ్రామ పంచాయతీలో విశ్వనాథ్‌రెడ్డికి వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు, విభిన్న ప్రతిభావంతులైన గంగాధరం, మునెమ్మ, మునికుమార్‌లకు రూ.6వేలు, వితంతు పింఛన్ కింద రాధమ్మ, మహాలక్ష్మమ్మలకు రూ.4 వేలును లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ట్రైనింగ్ కలెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మునిశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో విష్ణుచిరంజీవి, తహశీల్దార్ సురేష్‌బాబు, ఇన్‌చార్జి కార్యదర్శి మణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

నారాయణవనం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ ఆలయమైన మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య వృషభ లగ్నంలో ఘనంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ చంద్రప్రభ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలతో స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఏఈవో రవి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రసన్న వెంకటేశ్వరుడి మహాకుంభాభిషేకం



వరదయ్యపాళెం, మే 1(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం వడ్డిపాళెంలో వెలసిన పసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకం గురువారంతో ముగిసింది. ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, అష్టబంధన, మహాసంప్రోక్షణ వైభవంగా జరిగింది. ఆలయంలో హోమపూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి గ్రామోత్సవం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జనసేన నాయకులు తోట గణేష్, చంద్రశేఖర్, పేట చిరంజీవి, సురేష్, వెంకటరమణయాదవ్, మణి, చందుయాదవ్, దినేష్, మునిచంద్ర, చందు, మునికుమార్, వెంకటయ్య, వీర మహిళలు శారద, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని హైఫ్స్ వి షాపింగ్‌మాల్‌లో జిల్లా జడ్జి ఆదేశాల మేరకు గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కులు, విధుల గురించి అక్కడ పనిచేసే సిబ్బందికి వివరించారు. ప్రతి ఒక్కరూ కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విశ్వనాథ్, న్యాయవాదులు రాజేశ్వరరావు, శ్రీరామ్, మల్లికార్జున, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టంపైనే సమాజ పయనం

● వాడవాడలా ఘనంగా మేడే వేడుకలు





శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేస్తున్న పట్టణాధ్యక్షుడు విజయకుమార్ - సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలు

శ్రీకాళహస్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో కార్మికులు చేస్తున్న కష్టంపైనే సమాజం మొత్తం పయనం సాగిస్తోందని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మేడే వేడుకల్లో పారిశుధ్య కార్మికుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్మికుల పక్షపాతి అన్నారు. టీఎన్‌టీయూసీ పట్టణాధ్యక్షుడు అల్లం రవీంద్ర నాయుడు, టీడీపీ నాయకులు నెమళ్లూరు బుజ్జి, గోపి, సుబ్బయ్య, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు పఠాన్ ఫరీద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బీపీ ఆచార్య, కేసీ రెడ్డి, నరసింహులు, మాధవాచారి, కుప్పయ్య, లింగమూర్తి, శివప్రసాద్, టీఎల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో పట్టణంలోని రామసేతు వంతెన వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. జనసేన నాయకులు శివకుమార్ తోట గణేష్, చంద్రశేఖర్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, వెంకటరమణయాదవ్ తదితరులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల సమీపంలోని షాదీమహల్‌లో టూవీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ హాజరయ్యారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆటోనగర్ ఏర్పాటుకు త్వరలోనే కార్యాచరణ చేపడతారన్నారు. అంజాద్‌బాషా, షాకీరాలీ, జయ, మహేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి యూనియన్, ఆటో అంబులెన్సు యూనియన్, జయరామరావువీధిలోని మున్సిపల్ యూనియన్ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, నాయకులు చారుశీల, మురళి, గోపి, మునిచందు, అయ్యప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. పూసలవీధిలో టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి డైరెక్టర్ మిన్నల రవి, మాజీ కౌన్సిలర్ నివేదిత మోరె, నాయకులు రావిళ్ల మునిరాజా నాయుడు, ఉమేష్‌రావు, సుబ్బయ్య, కాసరం రమేష్, మునిరాజాయాదవ్, చంద్రశేఖర్, బీమాల భాస్కర్, మణి, జనసేన నాయకులు నవీన్, బీజేపీ నాయకులు రాజా తదితరులు పాల్గొన్నారు.

● ఏర్పేడు : ఏర్పేడు మండల కేంద్రంలో ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు హరీష్, పంచాయతీ కార్మికసంఘం నాయకులు చెంగల్రాయులు, బాలు, మారయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పాపానాయుడుపేటలో సీఐటీయూ, పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు.

● సత్యవేడు: కార్మికులు, కర్షకుల పక్షాన అండగా నిలబడి పోరాటాలు చేసేది ఎర్రజెండా మాత్రమేనని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ తెలిపారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం, పోస్టాఫీసు, ఎంపీడీవో కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంచి పెట్టారు. ● మండలంలోని పేరడం, మదనంబేడు గ్రామాల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పిచ్చాటూరు: పిచ్చాటూరు గాంధీనగర్ సర్కిల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి సీఐటీయూ నాయకులు జెండా ఆవిష్కరించారు. అదే విధంగా ఏఐటీయూసీ నాయకులు గ్రామ సచివాలయ ఆవరణలో జెండా ఆవిష్కరణ చేసి, ఆర్టీసీ బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● నారాయణవనం: మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి చంద్రబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి, కార్మికులకు అన్నదానం చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, హమాలీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు మునిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాబు మేస్త్రీ, దాము, టీకే వెంకటేష్, చిరంజీవి, శేఖర్, నాగార్జున, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

● రేణిగుంట: మండల పరిధిలోని గాజులమండ్యం, రేణిగుంట రోడ్డులోని పారిశ్రామిక వార్డుల్లో పనిచేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో 18 ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగరవేశారు. పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు మహిళా పారిశుధ్య కార్మికులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ప్రత్యేకంగా సన్మానించి, అల్పాహారాన్ని అందజేశారు. ఉదయం విమానాశ్రయంలో టాక్సీ డ్రైవర్లు మే డేని ఘనంగా నిర్వహించుకున్నారు.

● వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మండల కేంద్రంలో గురువారం ఘనంగా మేడే వేడుకలను నిర్వహించారు. కార్మిక జెండాను ఆవిష్కరించి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కార్మికుల శ్రమే మూలమన్నారు. కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు మునస్వామి, చంద్ర, తరుణ్‌కుమార్, వాణి, బాల గురునాథం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ● సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సీఐటీయూ నాయకులు ధనంజయులు, శాంతి గౌరి, నిర్మల, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఎగుర వేసి, అసువులుబాసిన కార్మికులకు నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, చొక్కలింగం, చంద్రమ్మ, శ్రీనివాసులు, కృష్ణయ్య, సీపీఎం నాయకులు ధనంజయ్య, బాల గురవయ్య, గురవయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● కేవీబీపురం: కేవీబీపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, ఆశాలు కార్మిక జెండాను ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులకు న్యాయం చేయాలన్నారు. తహసీల్దారు కార్యాలయం నుంచి సాయిబాబా ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.



రేణిగుంటలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న జనసేన ఇన్చార్జి వినుత



శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయంలో మేడే వేడుకలు



పాపానాయుడుపేటలో జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు



సత్యవేడులో ఎర్రజెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు



వరదయ్యపాళెంలో మేడే వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నేతలు

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, మే 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాళహస్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడు(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ రెండవ గేటు సమీపంలో చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు... ముక్కంటి ఆలయ శివయ్య గోపురానికి సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న 1వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాల కోసం ఆరా తీశారు. ఎలాంటి ఆచూకీ లభించలేదు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని, శవాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 1వ పట్టణ పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

బురదలో ఇరుక్కున్న టిప్పర్



ఎక్స్‌కవేటర్లతో బురదలో ఇరుక్కుపోయిన టిప్పర్‌ని బయటకు తీసేందుకు యత్నిస్తున్న దృశ్యం

రేణిగుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): బురదలో టిప్పర్ ఇరుక్కోవడంతో మూడు ఎక్స్‌కవేటర్లు పైకెత్తినా బయటకురాని సంఘటన బుగ్గవీధిలో చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం రేణిగుంట, తిరుపతి రైల్వే బైపాస్ లైన్ నిర్మాణానికి రైల్వే ట్రాక్‌కు సమానంగా ఎత్తును పెంచేందుకు టిప్పర్‌ల్లో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఓ టిప్పర్ ట్రాక్ నిర్మించే ప్రాంతంలో బురదలో ఇరుక్కుపోవడంతో ఏకంగా మూడు ఎక్స్‌కవేటర్ల సహాయం తీసుకుని పైకి లేపినా బయటకు రాలేకపోయింది. రెండు గంటల సేపు శ్రమించి అతి కష్టం మీద దానిని బయటకు తీశారు.

పోలీసుల కవాతు



రేణిగుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట పట్టణంలోని బజార్, జీఎం, పోస్టాఫీస్ వీధులతో పాటు రైల్వే స్టేషన్ వద్ద అర్బన్ సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గురువారం కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్ కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. అలాగే రాత్రి మండల పరిధిలోని గుండ్రాల కాల్వ గ్రామంలో సీఐ జయచంద్ర పోలీస్ సిబ్బందితో కలిసి పల్లె నిద్ర చేశారు.

వీధి దీపాలు ప్రారంభం



విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయి బీసీ కాలనీలో ఎమ్మెల్యే గ్రాంట్ కింద రూ.5 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వీధి దీపాలను ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం ఉదయం స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేయించి ఈ పనులు చేయించినట్లు వివరించారు.

అమరావతి పునర్నిర్మాణ భూమిపూజకు తరలి రండి

అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రధాని మోదీ ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లి విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ సుబ్రహ్మణ్యంరెడ్డి, సర్పంచ్ షుగప్రియ, వెంకటేష్, నాయకులు పద్దురాజు, సుమాంజలి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

300 మందికి అన్నదానం



కేక్ కట్ చేస్తున్న గిరీష్‌యాదవ్

బుచ్చినాయుడుకండ్రిగ, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు మాజీ ఎంపీపీ బట్టా రమేష్‌యాదవ్ కుమారుడు గిరీష్‌యాదవ్ జన్మోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గురువారం 300 మందికి అన్నదానం చేశారు. భారీ కేక్ కట్ చేశారు. నాయకులు రమణయ్య యాదవ్, ధనయ్య, యూత్ నాయకులు పాల్గొన్నారు.

6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల విడుదల

కేవీబీపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్థానిక ఆదర్శ పాఠశాలలో ఏప్రిల్ 21న జరిగిన 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయని ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను నోటిఫికేషన్‌లో పొందుపరిచామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రవేశాలు ఉంటాయని చెప్పారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి



ముద్దులమ్మ (పాతచిత్రం)

వరదయ్యపాళెం, మే 1 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన వరదయ్యపాళెం మండలం కంచరపాళెంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కంచరపాళెంకు చెందిన ముద్దులమ్మ(64) బుధవారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లింది. పనిచేసే ప్రదేశంలో మధ్యాహ్న సమయంలో వడదెబ్బతో అస్వస్థతకు గురైంది. తోటి కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కంచరపాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం పేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

రేణిగుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరకంబాడి పంచాయతీలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫాం పాండ్స్ ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం కరకంబాడి పంచాయతీలోని పశువుల నీటి తొట్టె, సీసీ రోడ్లను పరిశీలించారు.